
సాక్షి
బాపట్ల
బుధవారం । 27 । మార్చి । 2024



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం
పాత గుంటూరు : అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్‌: నాగార్జున సాగర్ నీటిమట్టం మంగళవారం 513.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
బాపట్ల	6.25	4.50
గుంటూరు	6.25	4.50
నరసరావుపేట	6.27	4.52

న్యూస్‌రీల్

శ్రీ లక్ష్మీనృసింహునికి వసంతోత్సవం



మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం వైభవంగా దివ్యరథోత్సవం నిర్వహించగా మంగళవారం ఉదయం స్వామి వారికి చక్రవారి చూర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి నిడమర్రుకు చెందిన కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి ఛాయాదేవి కైంకర్యపరులుగా వ్యవహరించారు. సాయంత్రం స్వామి వారికి పూర్ణాహుతి, ధ్వజఅవరోహణం నిర్వహించారు. అనంతరం రాత్రి కీలు గుర్రంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాన్ని ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

శింగరకొండ తిరునాళ్ల ఆదాయం రూ.8.26 లక్షలు

అద్దంకి రూరల్‌: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా దేవస్థానంలోని హుండీలలో వచ్చిన కానుకలను మంగళవారం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో లెక్కించారు. 10 రోజుల ఆదాయం రూ. 8.26 లక్షల నగదు, 16 గ్రాముల బంగారం, 465 గ్రాముల వెండి, 52 యూఎస్ డాలర్స్ వచ్చినట్లు దేవస్థాన సహాయక కార్యదర్శి టి.సుభద్ర తెలిపారు.

దుర్గమ్మ సేవలో దేవదాయశాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కమిషనర్ సత్యనారాయణను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి ప్రసాదాలను బహూకరించారు.

కార్తికేయున్ని దర్శించుకున్న వాణీమోహన్



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండస్ట్రీస్, ఆర్కియాలజీ, మ్యూజియమ్స్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిమోహన్ మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆమె నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

దుర్గమ్మ తలనీలాల టెండర్ ఖరారు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేసుకునే టెండర్‌ను తణుకుకు చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ దక్కించుకుంది. రూ. 5.61 కోట్లకు ఇండియన్ హెయిర్ ఇండ్రస్ట్రీస్ ఈ టెండర్‌ను కైవసం చేసుకుంది. గత ఏడాది రూ. 7.88 కోట్లకు టెండర్ పలకగా ఈ టెండర్ జనవరి నెలాఖరు నాటితో పూర్తయింది. దేవస్థానం టెండర్ నిమిత్తం ఆరు పర్యాయాలు బహిరంగ వేలం పక్రియను నిర్వహించింది. అయితే కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో తలనీలాలను దేవస్థానమే భద్రపరిచింది. ఆరో సారి టెండర్‌ను ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ రూ. 5.61 కోట్లకు వేలంలో దక్కించుకుంది. రెండో ఏడాది పది శాతం పెంపుతో కాంట్రాక్ట్‌ను పొడిగిస్తారు. అంతర్జాతీయ మార్కెట్‌లో తలనీలాలకు డిమాండ్ తగ్గడం వల్లే వేలం పక్రియలో ముందుకు రావడం లేదని కాంట్రాక్టర్లు పేర్కొనడంతో దేవస్థానం ఇదే విషయాన్ని దేవదాయ శాఖ కమిషనర్‌కు తెలియజేసింది. ఎట్టకేలకు ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్‌కు టెండర్‌ను అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతి రావడంతో సోమవారం నుంచి టెండర్‌ను కాంట్రాక్టర్‌కు అప్పగించారు.

మాయలోకేశ్ వస్తున్నాడు

మోసపూరిత హామీలతో ఎన్నికల ప్రచారం

- అధికారంలో ఉన్నప్పుడు పేదల ఇళ్లు తొలగింపు
- కోల్పోయిన తరువాత కపట నాటకాలు
- 20 వేల మంది పేదలకు ఇళ్లు ఇస్తానంటూ ప్రచారం
- 2014 నుంచి 2019 వరకు పేదల గురించి పెదవి విప్పని వైనం
- తొలగించిన బాధితులకు నష్టపరిహారం లేదు
- బుద్ధి చెబుతామంటున్న ప్రజలు



సాక్షి ప్రతినిధి, గుంటూరు/ తాడేపల్లి రూరల్‌: ఎన్నికల జిమ్మిక్కుల చినబాబు మళ్లీ ఎన్నికల సమరానికి సిద్ధమయ్యాడు. అధికారంలో ఉండగా నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు. పేదలకు పంపిణీ చేసిన స్థలాలను దొడ్డిదారిన కోర్టుల ద్వారా అడ్డుకున్న ఘనుడు. గతంలో ఇళ్లు తొలగించినా నష్టపరిహారం ఊసే ఎత్తలేదు. కానీ ఎన్నికల రాగానే హామీల చిట్టాలతో ఊరూరా ఊరేగేందుకు వచ్చాడు.

పేదల స్థలాలు అడ్డుకుని..

మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్‌తో పాటు దుగ్గిరాల మండలంలో పర్యటిస్తున్న సమయంలో అనేక మోసపూరిత హామీలు ఇస్తూ ప్రజలను లోకేష్ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్లు లేని అక్కా చెల్లెమ్మలకు రాజధాని భూముల్లో సెంటు భూమి కేటాయిస్తే ఇక్కడ పేదవారు ఉండడానికి వీలులేదంటూ రైతుల ముసుగులో కోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తెలుగుదేశం నాయకులు నియోజకవర్గంలో 20 వేల మంది పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తానంటూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అంతమందికి ఇళ్ల స్థలం ఇవ్వాలంటే సుమారు నాలుగు వందల ఎకరాల భూమి కావాలి. ఆ భూమి ఎక్కడ నుంచి సేకరిస్తారు అనే విషయాలను ప్రజలకు చెప్పడం లేదు. నారా లోకేష్ చిత్తశుద్ధి ఉంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన 20 వేల ఇళ్ల పట్టాలకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులు ఉపసంహరించుకోవాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని పేరుతో మంగళగిరి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో పంట పొలాలను వివిధ జోన్లుగా ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులు పెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కొంతమంది రైతులు వారి భూములను అమ్ముకునే విధంగా వెసులుబాటు కల్పిస్తూ జోన్లు తీసివేశారు. మళ్లీ జోన్లు ఏర్పాటు చేసి రైతులను ఇబ్బంది పెట్టి భూములను ల్యాండ్ పూలింగ్ కింద తీసుకుని మోసగిస్తారా లేదా మార్కెట్ విలువ కట్టి రైతులకు అందజేస్తారా అని రైతులకు నారా లోకేష్ చెప్పాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే పెనుమాక, ఉండవల్లి భూములను ల్యాండ్‌పూలింగ్ నుంచి వెనక్కి తీసుకొచ్చారు.

క్రమబద్ధీకరణ అంటూ..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను, రాష్ట్రం విడిపోయిన తరువాత తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు రెండుసార్లు మంగళగిరి నియోజకవర్గంలోని ప్రకాశం బ్యారేజ్, ముగ్గురోడ్డు తదితర ప్రాంతాల్లో పేదల నివాసాలను క్రమబద్ధీకరణ చేస్తానని హామీ ఇచ్చారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి, ఐదేళ్లు మంగళగిరి నియోజకవర్గం పరిధిలో నివాసం ఉండి చెప్పిన పని ఒక్కటీ చేయలేదు. సీఎం జగన్ ఆధ్వర్యంలో గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను రెగ్యులరైజ్ చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణుడి గుడి, యాదవుల బజార్, ముస్లింల ఏరియా, వడ్డెర కాలనీ, ముగ్గురోడ్డు, సంజీవయ్య నగర్ ప్రాంతాల్లో రెగ్యులరైజ్ చేసేందుకు ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించింది. ఇలాంటి పరిస్థితుల్లో తెలుగుదేశం నాయకులు ప్రజలను మేము రెగ్యులైజ్ చేస్తామంటూ మోసగిస్తున్నారు. రైల్వే, అసైన్డ్, కొండవాగు, అటవీ ప్రాంతాల్లో నివసించే వారిని ఇబ్బందులకు గురిచేస్తే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అడ్డుకుని ఇళ్లను తొలగించకుండా చేశారు. పుష్కరాల సమయంలో తొలగించిన 322 ఇళ్లను ఇప్పటికీ ఇవ్వలేదు.

కృష్ణానదిలో రిటైనింగ్ వాల్...

మహానాడు, సుందరయ్య నగర్లో 2014 నుంచి 2019 వరకు ఇది రాజధాని ప్రాంతం దీనిని సుందరంగా తీర్చిదిద్దుతాం, పార్కులు, హోటళ్లు నిర్మిస్తాం.. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఇళ్లు ఉండడానికి వీలులేదంటూ ప్రకటించిన తెలుగుదేశం నాయకులు ఇప్పుడు వరద నీటికి మునగకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉంది. విజయవాడ కృష్ణలంక వైపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రిటైనింగ్ వాల్ పూర్తి చేయడంతో ఇప్పుడు టీడీపీ నాయకులు ఇటువైపు రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని హామీ తెరపైకి తీసుకొచ్చారు.

ఇచ్చిన 26 హామీలు అమలు చేస్తారా?

తెలుగుదేశం అభ్యర్థి నారా లోకేష్, వారి పార్టీ మేనిఫెస్టో కాకుండా మంగళగిరి నియోజకవర్గంలో మరో 26 హామీలను ప్రజల ముందుకు తీసుకొచ్చారు. 2014 నుంచి 2019 వరకు మంగళగిరి నియోజకవర్గంలోనే నివాసమున్న నారా లోకేష్ ఎంత సేపూ రాజధాని మాస్టర్ ప్లాన్ గురించే వారి పార్టీ నాయకులతో, అధికారులతో చర్చించారు. చివరకు ఉండవల్లి అమరావతి కరకట్ట నుంచి కేఎల్ రావు కాలనీ మీదుగా సీతానగరం, మహానాడు, మణిపాల్ హాస్పిటల్‌ను కలుపుతూ స్పీడ్ యాక్సస్ రోడ్ ఏర్పాటు చేస్తామని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పుడు అదే ప్రాంతంలోని కేఎల్ రావు కాలనీ, సీతానగరం తదితర ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామని ప్రచారం చేస్తున్నారు. స్పీడ్ యాక్సస్ రోడ్ నిర్మాణం ఆపుతామని ఎక్కడా హామీ ఇవ్వడం లేదు. నులకపేట నుంచి పెనుమాక వైపు సొరంగం ఏర్పాటు చేయడానికి, సచివాలయానికి వెళ్లడానికి ప్రత్యేక రోడ్డు నిర్మాణం చేసేందుకు, కుంచనపల్లి బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి దగ్గర నుంచి రైతుల పంట పొలాల మీదుగా రైల్వే ట్రాక్ దాటుతూ ఓవర్ నిర్మించి రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. ఆ రోడ్డు నిర్మిస్తే నులకపేటలో ఫారెస్ట్ భూములో ఉన్న ఇళ్లను తొలగించాల్సి వస్తుంది. రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర అటవీ శాఖ అనుమతి అడిగితే నిరాకరించడంతో రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. ఇప్పుడు ఆ భూములను డీ-ఫారెస్టు ఎలా చేస్తారో నారా లోకేష్ చెప్పాలంటున్నారు.

అపార్ట్‌మెంట్‌లో భారీ చోరీ

- కోటి విలువైన బంగారం మాయం
- సీసీ ఫుటేజ్ పరిశీలన
- దర్యాప్తు చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు

నరసరావుపేట టౌన్‌: అపార్ట్‌మెంట్‌లో కోటి రూపాయల విలువైన బంగారు ఆభరణాలు అపహరణకు గురైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాష్‌నగర్ పాత కన్నెల ఆస్పత్రి ఎదుట వెంకటాద్రి అపార్ట్‌మెంట్‌లోని ఓ ప్లాట్‌లో ఎం.చంద్రశేఖర్ శర్మ, లక్ష్మీప్రసన్న దంపతులు నివాసం ఉంటున్నారు. శర్మ పట్టణ శివారు వాటర్ బాటిళ్ల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తుంటారు. వీరు ఒంగోలు సమీపంలో నూతనంగా ఇంటిని నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు పర్యవేక్షించేందుకు గత రెండు నెలలుగా దంపతులిద్దరూ తరచూ వెళ్లి వస్తున్నారు. రెండు రోజుల క్రితం బెడ్‌రూం కప్‌బోర్డులోని ట్రంక్ పెట్టెలో భద్ర పరిచిన బంగారం నగలు, వెండి వస్తువులు తీసేందుకు పెట్టె తెరవగా అందులో ఆభరణాలు కనిపించలేదు. దీంతో సమాచారాన్ని వన్‌టౌన్ పోలీసులకు అందించారు. సీఐ కృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. మంగళవారం క్లూస్‌టీం సభ్యులు చోరీ జరిగిన గృహాన్ని పరిశీలించి ప్రాథమిక ఆధారాలు సేకరించారు.

ఇంటి దొంగల పనేనా.... ?

సాధారణంగా గృహంలో బంగారం భద్ర పరిచేందుకు బీరువా లేక లాకర్‌ను అందరూ ఉపయోగిస్తుంటారు. అయితే సాధారణ పెట్టెలో పెట్టి వాటిని కప్‌బోర్డ్‌లో పెట్టటం.. ఇంట్లో మిగిలిన ఏ వస్తువులూ ముట్టకుండా పెట్టెలోని బంగారం ఆభరణాలు మాత్రమే అపహరించుకు వెళ్లటంపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నెల రోజుల క్రితం ఓ శుభకార్యానికి వెళ్తూ లక్ష్మీ ప్రసన్న బంగారు ఆభరణాలు ధరించి వెళ్లింది. తిరిగి వచ్చి ట్రంక్ పెట్టెలో భద్రపరిచింది. అప్పటి నుంచి బంగారం వస్తువులు చూడలేదు. రెండు రోజుల క్రితం పెట్టె తెరవటంతో చోరీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నెల రోజుల వ్యవధి నుంచి ఉన్న అపార్ట్‌మెంట్ సీసీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్
- మత్స్యకార గ్రామాల్లో ఎన్నికలపై అవగాహన
- గ్రామాల్లో పారా మిలటరీతో కవాతు



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

వేటపాలెం: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని.. ఎన్నికల నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. వేటపాలెం మండల పరిధిలోని సమస్యాత్మక మత్స్యకార గ్రామాలైన రామాపురం, కఠారివారిపాలెం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. తొలుత ఎస్పీ రెండు గ్రామాల్లో పారా మిలటరీ బలగాలు నిర్వహించిన కవాతులో పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రతి గ్రామంలో పారా మిలటరీ ఫోర్సుతో ఎన్నికల బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు గ్రామాల్లో గతంలో రెండు వర్గాలుగా ఏర్పడి గొడవలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. ఆ వివాదంలో చాలా మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. అలాంటివి మళ్లీ ఎన్నికల సమయంలో జరగకూడదన్నారు. ఎవరైనా అలజడులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఇప్పటికే రెండు గ్రామాల్లో అనేక మంది పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందుగా అవగాహన కల్పించామని చెప్పారు. గ్రామాలు ప్రశాంత వాతావరణంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇరువర్గాలు కలసి మెలసి ఉంటే రాబోయే రోజుల్లో గతంలో నమోదైన కేసులు తొలగిస్తామని ఎస్పీ జిందాల్ తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బ్రిజ్ కిషోర్ నేగి, డీఎస్పీ బీ ప్రసాద్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్ఐ జి.సురేష్ పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వెంకటరామిరెడ్డి
- ఇటీవల 29 మంది సిబ్బంది తొలగింపు
- టోల్‌ఫ్రీ నంబర్లు 0863 2233576, 9949351046



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కె.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్/రెస్టారెంట్ నిర్వాహకులు అనుసరించాల్సిన నియమ, నిబంధనలపై మంగళవారం వివరాలు వెల్లడించారు. ప్రతి మద్యం సీసా మూతపై హీల్(ఏ డిస్టిలరీలో తయారైంది, ఏ డిపోకు వెళ్లింది, ఏ దుకాణంకు వెళ్లింది) ఉండాలి. సీసాపై ఆమోదించిన లేబుల్ తప్పనిసరి. సుంకం చెల్లించిన మద్యం మాత్రమే విక్రయించాలని, నాన్-డ్యూటీపెయిడ్ మద్యం నిల్వ/ విక్రయించడం పూర్తిగా నిషేధమని చెప్పారు.

విస్తృత తనిఖీలు..

గతేడాదిలో జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్/ రెస్టారెంట్లకు పంపిణీ చేసినట్లుగానే ఈ సంవత్సరం మద్యం సరఫరా చేసినట్లు ఆయన తెలిపారు. ఇటీవల జిల్లాలోని 120 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో, 102 బార్/ రెస్టారెంట్‌లలో సీఐలు, ఎస్ఐల సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. బార్ లైసెన్స్/ ఆమోదం పొందిన బ్లూప్రింట్‌లను కనిపించే ప్రదేశంలో అతికించాలి. నిర్ణీత వేళలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందే. మద్యం పలచగా, కల్తీ చేయడం, ఒక బ్రాండ్ మద్యాన్ని మరో బ్రాండ్ సీసాల్లోకి మార్చడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఇక ఎటువంటి అనధికార మద్యం సీసాలు నిల్వ చేయడం, విక్రయించడం చేయవద్దని స్పష్టం హెచ్చరించారు.

25 కేసులు నమోదు..

ప్రతి సీసా స్కానింగ్ చేసి విక్రయించాల్సిందే. లూజు విక్రయించడం, నిర్ణయించిన ధర (ఎంఆర్‌పీ) కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. ఇటీవల జిల్లాలోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేసి, అందులో ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తున్న వారిపై 25 కేసులు నమోదు చేసి, 29 మందిని వెంటనే విధుల నుంచి తొలగించినట్లు ఆయన తెలిపారు. తొలగించిన 29 మందిలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్‌లు ఉన్నట్లు చెప్పారు.

నిబంధనలు కఠినతరం..

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నిబంధనలను కట్టుదిట్టం చేశామని తెలిపారు. ప్రతి రోజు ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరిచినప్పుడు ఎంత ఉంది(ఓపెన్ స్టాక్), ఎంత కొనుగోలు చేశారు, ఎంత వరకు విక్రయించారు, దుకాణం మూసివేసే వేళకు ముగింపు నిల్వ తదితర అంశాలపై రోజు తర్వాత రోజు గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సెల్‌కు, ఎన్నికల అధికారులకు నివేదిక అందిస్తున్నమని చెప్పారు.

అందుబాటులో టోల్‌ఫ్రీ..

ఇక అనధికార మద్యం విక్రయాలు, అక్రమంగా పెద్ద ఎత్తున్న నిల్వ చేసిన వారిపైనా, జిల్లాలో ఏదైనా ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్/రెస్టారెంట్‌ల్లో నిబంధనలు అతిక్రమిస్తే ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు అవకాశం ఉందని చెప్పారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జల వనరులు, ప్రజల అవసరాలు, వాటి వినియోగంపై అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం ఏప్రిల్ 8వ తేదీన సాగర్ నీరు విడుదల కానుందని తెలిపారు. జిల్లాలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపాలన్నారు. నీటి కొరత ఉన్నందున నీటి చౌర్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగర్ కాలువలకు నీరు విడుదలయ్యేలోగా అత్యవసరమైన మరమ్మతులు, లీక్‌ల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రక్షిత తాగునీటి పథకాల పనులు శరవేగంగా పూర్తి చేయాలని కోరారు. నాగార్జునసాగర్ కాలువల కింద ఉన్న 131 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపడానికి 0.443 టీఎంసీలు, కృష్ణా పశ్చిమ డెల్టా కింద ఉన్న 52 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపడానికి 0.16 టీఎంసీలు, గుండ్లకమ్మ నది పరీవాహక ప్రాంతాలలోని చెరువులు నింపడానికి 0.05 టీఎంసీలు వస్తుందన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తొలగించడానికి క్షేత్రస్థాయిలో మరింత పక్కాగా ప్రణాళిక రూపొందించి నివేదిక అందించాలన్నారు.

జల వనరులు లేని గ్రామాలకు..

జల వనరులు అందుబాటులో లేని గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీరు అందించే ఏర్పాట్లు అధికారులు చేపట్టాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. ప్రస్తుతం 153 చేతిపంపులు చెడిపోయాయని వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు లేని గ్రామాలలో బోర్లు వేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయితీ నిధులు వినియోగించాలన్నారు. చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొల్లూరు మండలంలోనే పది మీటర్ల మేర భూగర్భ జలాలు అడుగంటాయని కలెక్టర్ చెప్పారు. బోర్లు వేయడానికి అవకాశాలు లేని ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీరు తరలించడంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ యాప్ అనుసంధానిస్తామని కలెక్టర్ చెప్పారు. జిల్లాస్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉంటారన్నారు. 750 బ్లాక్ లుగా గుర్తించి పూర్తిస్థాయి పర్యవేక్షణ కొరకు మండల, పంచాయితీ స్థాయిలో కమిటీలు వేస్తున్నట్లు వివరించారు.

మండలాల వారీగా ప్రతిపాదనలు..

మండలాల వారీగా నీటి లభ్యత, రానున్న అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ కోరారు. ప్రస్తుతం వేమూరు నియోజకవర్గంలో 159 గ్రామాలు ఉండగా, 12 గ్రామాలు రక్షిత నీటి పథకంపై ఆధారపడ్డాయని మిగిలిన వాటికి బోర్లు, ఫిల్టర్ బెడ్ల ద్వారా నీరు అందుతుందని చెప్పారు. బాపట్ల నియోజకవర్గంలో 133 గ్రామాలు ఉంటే 93 గ్రామాలు బోర్లపైన ఆధారపడ్డాయని వివరించారు. అద్దంకి నియోజకవర్గంలోని 101 గ్రామ పంచాయతీల్లోని ప్రజలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, బోర్ల ద్వారా నీరందుతుందని చెప్పారు. పర్చూరులో 143 గ్రామపంచాయతీలలో 83 ట్యాంకులు ఉండగా మిగిలిన వాటికి సాగర్, పంట కాల్వల ద్వారా నీరు వస్తుందన్నారు. చీరాలలో 63 గ్రామాలు ఉండగా ఒక గ్రామానికి నేటి సమస్య ఉందని, మిగిలిన వాటికి చెరువులు కాలువల ద్వారా నీరందుతుందని పేర్కొన్నారు. చీరాల పట్టణానికి మూడు నెలల వరకు నీటి సమస్య లేదన్నారు. రేపల్లెలో గ్రామాలన్నీ కాల్వల పైనే ఆధారపడినట్లు వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

‘పది’ మూల్యాంకనానికి ఏర్పాట్లు

- నేటితో ముగియనున్న ప్రధాన పరీక్షలు
- ఏప్రిల్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు స్పాట్ వాల్యూయేషన్
- విధులకు వెయ్యి మంది ఉపాధ్యాయులు
- జిల్లాకు రానున్న 2 లక్షల స్క్రిప్టులు
- స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం మార్పు



సెయింట్ జోసఫ్ సీబీఎస్ఈ హైస్కూల్

గుంటూరు ఎడ్యుకేషన్‌: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థుల ఆన్సర్ పేపర్ల మూల్యాంకన ప్రక్రియ (స్పాట్ వాల్యూయేషన్)కు ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. టెన్త్ ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు బుధవారం ముగియనుండటంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న స్పాట్ వాల్యూయేషన్‌కు గుంటూరు జిల్లాలో దాదాపు వెయ్యి మంది ఉపాధ్యాయులను మూల్యాంకన విధుల్లో నియమించారు. సబ్జెక్టుల వారీగా అవసరమైన ఉపాధ్యాయులను చీఫ్ ఎగ్జామినర్, ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించిన విద్యాశాఖాధికారులు సంబంధిత ఉపాధ్యాయులకు ఆర్డర్లు పంపించారు. సంబంధిత ఉపాధ్యాయులు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సెయింట్ జోసఫ్ హైస్కూల్లో జరగనున్న స్పాట్ వాల్యూయేషన్‌కు హాజరు కావాల్సి ఉంది. వివిధ జిల్లాల నుంచి రెండు లక్షల స్క్రిప్టులు రానుండగా, ఒక ఉపాధ్యాయుడు రోజుకు 40 చొప్పున పేపర్లను మూల్యాంనం చేయాల్సి ఉంది.

మారిన మూల్యాంకన కేంద్రం..

గుంటూరు జిల్లాలో టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని మార్పు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతి యేటా టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ నిర్వహిస్తూ వచ్చిన నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాల స్థానంలో ప్రస్తుత ఏడాది నుంచి పెదకాకానిలోని సెయింట్ జోసఫ్ సీబీఎస్ఈ హైస్కూల్‌కు మార్పు చేశారు. స్టాల్ బాలికోన్నత పాఠశాల దశాబ్దాల క్రితం నిర్మించినది కావడంతో మౌలిక వసతుల దృష్ట్యా టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని అక్కడి నుంచి మార్చాల్సిందిగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాల మేరకు ఎట్టకేలకు అక్కడి నుంచి తరలించారు. సెయింట్ జోసఫ్ హైస్కూల్లో భద్రతతో పాటు మౌలిక వసతుల పరంగా అన్ని సదుపాయాలను ఉన్నట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. మూల్యాంకన విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ పి.శైలజ చెప్పారు.

క్లుప్తంగా

ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ తీరు వివాదాస్పదం

పట్టించుకోని అధికారులు

మంగళగిరి: జిల్లాలో ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ తీరు వివాదాస్పదంగా తయారైంది. 2019 ఎన్నికలలో లోకేష్ గెలుపునకు అప్పటి నార్త్ జోన్ డీఎస్పీ, ఆయన శిష్యుడు ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ విశేషంగా కృషి చేశారనే ఆరోపణలున్నాయి. డీఎస్పీ తన వాహనాలలో నగదు అన్ని ప్రాంతాలకు చేర్చి సహకరించారనే విమర్శలు ఎదుర్కొన్నారు. ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ ప్రస్తుతం ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎస్పీని సస్పెండ్ చేశారు. దీంతో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. తిరిగి లోకేష్ మంగళగిరి నుంచి బరిలోకి దిగడంతో డీఎస్పీ మళ్లీ రంగంలోకి దిగారు. అప్పట్లో తన శిష్యులుగా ఉన్న వారిని మంగళగిరి ఇంటెలిజెన్స్, ఎస్‌బీలలో దించి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని లోకేష్‌కు చేరవేస్తున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏఎస్ఐ ఓ టీడీపీ నాయకుడు బంధువు ఇంట్లోనే ఎప్పుడూ ఉంటుండటం ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఈ ఏఎస్ఐకి సకలం టీడీపీ వారే అందిస్తుండగా ఉదయం వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వచ్చి ఇక్కడ సమాచారం సేకరించి వెంటనే టీడీపీకి చేరవేయడమే ఏఎస్ఐ విధి అని పోలీస్ వర్గాలు బహిరంగంగానే చెబుతున్నాయి. కొత్తగా పట్టణానికి ఎస్‌బీ కానిస్టేబుల్‌గా వచ్చిన వ్యక్తి నేరుగా ఇక్కడి గెలుపోటములపై సవాల్ విసురుతుండడంతో అధికారులతోపాటు సిబ్బంది విస్తుపోతున్నారు. ఇప్పటికైనా ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే ఉన్నతాధికారులు ఒక పార్టీకి పనిచేసే ఉద్యోగులను తొలగించాలని మంగళగిరి నియోజకవర్గ ఓటర్లు కోరుతున్నారు.

భరతనాట్యం చిత్ర బృందం సందడి

పెదకాకాని: యువ నటీనటులు సూర్యతేజ ఏలే, మీనాక్షి గోస్వామి హీరో హీరోయిన్లుగా కె.వి.ఆర్. మహేంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న హాస్యకథ భరతనాట్యం చిత్ర బృందం వీవీఐటీని సందర్శించింది. ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం సభ్యులు చిత్ర ప్రచారంలో భాగంగా వీవీఐటీ కళాశాల సందర్శించి సందడి చేశారు. హీరో సూర్య తేజ మాట్లాడుతూ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. ఆసక్తికర కథాకథనంతో హాస్య ప్రధానంగా ఈ చిత్రాన్ని రూపొందించారని తెలిపారు. డైరెక్టర్ మహేంద్ర మాట్లాడుతూ, ఈ చిత్రం విభిన్నమైన కథతో రూపొందిందని వివరించారు. వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లికారున రెడ్డి, చిత్ర హీరో సూర్య తేజ, హీరోయిన్ మీనాక్షి, డైరెక్టర్ మహేంద్ర, చిత్ర నటీనటులు పాల్గొన్నారు.

అధునాతన శస్త్రచికిత్సలతో ప్రాణాలు పదిలం

- బ్రెయిన్ సమస్యలకు భరోసాగా నిలుస్తున్న గుంటూరు జీజీహెచ్
- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా బ్రెయిన్ సర్జరీలు
- ఖరీదైన ఆపరేషన్‌లు ఉచితంగా చేస్తున్న న్యూరో సర్జన్లు
- ప్రతిరోజూ ఆరు బ్రెయిన్ ఆపరేషన్‌లు
- లైవ్ సర్జరీలతో రికార్డులు సృష్టించిన వైద్య బృందం


అవేక్ బ్రెయిన్ సర్జరీ చేసిన న్యూరో సర్జన్‌లను అభినందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్ : ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కోటి పండు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం ఇలపర్రు గ్రామానికి చెందిన 48 ఏళ్ల పండు జనవరి 2న అపస్మారక స్థితిలో గుంటూరు జీజీహెచ్‌కు వచ్చారు. కుడి కాలు, కుడి చెయ్యి బలహీన పడి ఉండటంతో న్యూరో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గద్దల పెంచలయ్య రోగికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మెదడులో నోటార్ కార్టెక్స్ భాగంలో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. సదరు భాగంలో ట్యూమర్ తొలగించే ప్రక్రియలో కుడికాలు, కుడి చెయ్యి చచ్చుపడిపోయే అవకాశం ఉందని నిర్ధారించారు. దీని కోసం రోగికి మెలుకువ ఉండగానే ఆపరేషన్ చేయాలని నిర్ణయించి రోగి అభిమాన హీరో మహేష్‌బాబు నటించిన పోకిరి సినిమాను జనవరి 25న ల్యాప్‌ట్యాప్‌లో చూపిస్తూ బ్రెయిన్ అవేక్ సర్జరీ చేసి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. రోగి మెలుకువగా ఉండగానే బ్రెయిన్ సర్జరీ చేసిన మొట్ట మొదటి ప్రభుత్వ ఆసుపత్రిగా గుంటూరు జీజీహెచ్ రికార్డుల్లోకెక్కింది. ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్సలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జీజీహెచ్ న్యూరో సర్జరీ వైద్య విభాగానికి ప్రత్యేకంగా వైద్య పరికరాలు, వైద్య సిబ్బందిని మంజూరు చేయడమే కారణం.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం

గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జరీ వైద్య విభాగంలో పేద రోగులకు కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందజేస్తున్నారు. బ్రెయిన్ సమస్యలు, రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలు అయిన వారికి అత్యాధునిక వైద్య పరికరాలతో సర్జరీలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. గుంటూరు జీజీహెచ్‌కు వచ్చే పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా వైద్య సేవలను అందించేలా పలు ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించడమే కాకుండా వైద్య పరికరాలను సైతం సీఎం మంజూరు చేశారు. అందులో భాగంగానే రూ.4 కోట్ల విలువైన వైద్య పరికరాలను ప్రభుత్వం గుంటూరు జీజీహెచ్ న్యూరో సర్జరీ విభాగానికి అందజేసింది. అదనంగా న్యూరోసర్జరీ వైద్య విభాగానికి యూనిట్‌ను మంజూరు చేసి న్యూరోసర్జన్లను సైతం ప్రభుత్వం నియమించింది. తద్వారా న్యూరో సర్జన్లు కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీ పడి అత్యాధునిక శస్త్ర చికిత్సలను, అరుదైన శస్త్రచికిత్సలను ఉచితంగా చేస్తూ పేదల ప్రాణాలు కాపాడుతున్నారు.

అనేక జిల్లాల నుంచి రోగులు

న్యూరో సర్జరీ వైద్య విభాగంలో 40 పడకలు ఉన్నాయి. మెదడుకు వచ్చే ఎలాంటి ఆరోగ్య సమస్యలకైనా వైద్య విభాగంలో పూర్తి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ప్రతిరోజూ మేజర్, మైనర్, ఎమర్జెన్సీ ఆపరేషన్లు ఆరుకు పైగా చేస్తూ రికార్డు స్థాయిలో ఆపరేషన్లు చేస్తున్న వైద్య విభాగంగా న్యూరోసర్జరీ విభాగం ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు జిల్లాలకు చెందిన రోగులు ప్రతిరోజూ వైద్యం కోసం జీజీహెచ్‌కు వస్తున్నారు. న్యూరో సర్జన్లు పోటీ పడి ఆధునిక పద్ధతుల్లో ఆపరేషన్లు చేస్తూ రోగుల ప్రాణాలు కాపాడుతున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షలాది రూపాయల ఆపరేషన్‌లు పూర్తి ఉచితంగా చేస్తున్నారు.

24 గంటలూ ఆపరేషన్లు

న్యూరోసర్జరీ వైద్య విభాగంలో బ్రెయిన్ సమస్యలతో వచ్చే వారికి 24 గంటలూ వైద్యసేవలను అందిస్తున్నారు. వైద్యసేవలను పొందాలనుకునేవారు మంగళవారం, గురువారం 20వ నెంబర్ ఓపీ గదిలో వైద్యులను సంప్రదించాలి. క్యాజువాలిటీలో నిత్యం బ్రెయిన్ ప్రమాద బాధితులకు డ్యూటీ డాక్టర్లు హాజరై వైద్యసేవలను అందిస్తున్నారు. సాధారణ ఆపరేషన్ థియేటర్‌తో పాటుగా అత్యవసర ఆపరేషన్ థియేటర్‌లో బ్రెయిన్ సమస్యలతో వచ్చే వారికి ఆపరేషన్లు చేస్తున్నారు.

అందుబాటులో ఆధునిక వైద్య సేవలు

పేద రోగులకు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్‌లో అత్యాధునిక వైద్య పద్ధతుల్లో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. హైస్పీడ్ మైక్రోడ్రిల్, సీఆర్మ్, అత్యాధునిక ఆపరేషన్ మైక్రోస్కోప్(లైకా), స్టీరియోటాక్సీ, న్యూరో ఎండోస్కోపి, క్యూసా, సుజితా హెడ్ ఫిక్షేనల్ సిస్టమ్ విత్ లైలారీట్రాక్టర్ అండ్ ఆల్ ఎక్సరీస్, న్యూరో సర్జికల్ ఆపరేషన్ టేబుల్స్ వైద్య పరికరాలు ఉన్నాయి. ఆధునిక వైద్య పద్ధతుల్లో సర్జరీలు చేయటం ద్వారా ప్రమాద బాధితులు, రోగులు త్వరగా వ్యాధి బాధల నుంచి కోలుకుని ఆరోగ్యంతో ఇంటికి వెళ్తున్నారు. కోత, కుట్టు లేని ఎండోస్కోపీ ఆపరేషన్లు, డిస్క్ ఆపరేషన్లు, బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్లు, మెడ వెన్నుపూస విరిగిన వారికి, పక్షవాతం ద్వారా మెదడులో రక్తనాళాలు చిట్లిన వారికి వ్యాస్క్యులర్ సర్జరీలు చేస్తున్నారు. అన్ని రకాల ట్యూమర్‌లను ఆపరేషన్లు చేసి తొలగించి నూతన జీవితాన్ని ప్రసాదిస్తున్నారు.

మెదడును జాగ్రత్తగా కాపాడుకోవాలి



వయస్సు పెరిగే కొద్దీ మెదడు, రక్తనాళాలు పగిలి ప్రాణాంతకం అయ్యే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని పెద్ద వయస్సు వారు న్యూరో సర్జన్స్‌ను సంప్రదించి తమ మెదడు పనితీరు గురించి తరచుగా తెలుసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఒత్తిడికి గురి కాకూడదు. నిత్యం యోగా, ధ్యానం, శారీరక వ్యాయామాలు చేయాలి. మద్యపానం, ధూమపానంకు దూరంగా ఉండాలి. చేపలు, గుడ్లు, తాజా పండ్లు తీసుకోవాలి. మెదడు నిరంతరం పదునుగా పనిచేసేలా ఫజిల్స్ చేయటం, నూతన విషయాలు నేర్చుకోవటం చేయాలి.

– డాక్టర్ కేవీవీ సత్యనారాయణ మూర్తి, న్యూరోసర్జరీ విభాగాధిపతి.

ప్రభుత్వ చొరవతో ఉచితంగా ఆపరేషన్లు



కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా న్యూరో సర్జరీ వైద్య విభాగంలో ఆధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్లు చేస్తున్నాం. ప్రభుత్వం వైద్య విభాగానికి కోట్లాది రూపాయలు ఖరీదు చేసే ఆధునిక పరికరాలను మంజూరు చేసింది. తద్వారా అత్యంత క్లిష్టమైన, అత్యంత అరుదైన శస్త్ర చికిత్సలను చాలా సువులుగా చేస్తున్నాం. ఇటీవల అవేక్ బ్రెయిన్ సర్జరీ చేసి రోగి ప్రాణాలు కాపాడి అరుదైన రికార్డును సొంతం చేసుకోవడం చాలా సంతోషంగాఉంది.

– డాక్టర్ గద్దల పెంచలయ్య న్యూరోసర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్.


ల్యాప్‌ట్యాప్‌లో సినిమా చూస్తూ ఆపరేషన్ చేయించుకుంటున్న పండు


న్యూరోసర్జరీలో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్)



న్యూరో సర్జరీ వైద్య విభాగం

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు



బాపట్ల: ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఎస్సీ సబ్ ప్లాన్ కింద వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన రైతు విజ్ఞాన యాత్ర సభలో ముఖ్య అతిథిగా అసోసియేట్ డీన్ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ సబ్ ప్లాన్‌తో రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, మెలకువలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నేర్పించడం జరుగుతుందన్నారు. రైతులు ఇక్కడ నేర్చుకున్న విజ్ఞానాన్ని ఆచరిస్తే ఉత్తమ ఫలితాలను పొందుతారన్నారు. ఈ రైతు విజ్ఞాన యాత్రలో భాగంగా రైతులను వివిధ పరిశోధన స్థానాలకు తీసుకెళ్లడం జరిగిందని, వరి పరిశోధన స్థానంలో మేలైన సాగు పద్ధతుల గురించి శిక్షణ ఇస్తామన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పాలు, పాల పదార్థాలు, చిరు ధాన్యాలను వాడుకునే పద్ధతుల గురించి వివరించారు. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యవసాయంలో వాడుకోదగిన నూతన పరికరాల గురించి తెలియజేశారు. ఆ పరికరాల ద్వారా అపరాలు, చిరుధాన్యాలు, వరిని ప్రాసెస్ చేసే విధానంలో శిక్షణ ఇస్తామన్నారు. అంతేకాకుండా పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్‌లో కోత అనంతర పరిజ్ఞానం గురించి, రవి గార్డెన్స్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గురించి అవగాహన కల్పించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ విభాగాధిపతి డాక్టర్ ఎం.సి.ఓబయ్య, డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ కె.సుశీల, ఎమ్మెస్సీ, పి.హెచ్.డి విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవులను మోసం చేసిన పార్టీలను ఓడిస్తాం

మంగళగిరి: యాదవలను మోసం చేసిన రాజకీయ పార్టీలను ఓడిస్తామని రాష్ట్ర ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్ క్లబ్ భవనంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 2 లక్షల మంది యాదవులున్నారని, యాదవలంతా ఏకమై భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. అధికంగా యాదవులున్నా కేటాయించ లేదని, ఆయా పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుర్రా శ్రీనివాసరావు, తోట శివరామ్ ప్రసాద్, దొంతిబోయిన శ్రీనివాస్, పేరయ్య, కుర్రా పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ సదస్సు అడ్డుకుంటాం

- 30న మాదిగ దండోరా మోగిస్తాం
- నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు


సంఘీభావం తెలియజేస్తున్న నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు

నెహ్రూనగర్: ఆరు నూరైనా 30న మంద కృష్ణ మాదిగ పెట్టిన సదస్సును అడ్డుకుంటాం.. ఆయనను ఆంధ్రా నుంచి తరిమి తరిమి కొడతామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీకి మద్దతుగా చంద్రబాబు డైరెక్షన్‌లో ఈనెల 30న గుంటూరులో మందకృష్ణ మాదిగ సదస్సు నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ముఖ్య నేతలు అత్యవసరంగా భేటీ అయ్యారు. కొల్లి శారద కూరగాయల మార్కెట్ సమీపంలోని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో పరిశపోగు శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశంలో మంద కృష్ణ మాదిగ వైఖరిపై మండిపడ్డారు. పచ్చి దళిత ద్వేషి అయిన చంద్రబాబుకు చెంచాగిరీ చేస్తూ మాదిగ ద్రోహిగా మంద కృష్ణ మాదిగ మారిపోయాడని ఈసడించారు. మాదిగ జాతి మొత్తాన్ని చంద్రబాబుకు ఊడిగం చేయించాలని చూస్తున్న ఆయన వ్యవహారాన్ని తప్పుబట్టారు. మాదిగల సదస్సు పేరిట 30న గుంటూరులో తలపెట్టిన కపట నాటకాన్ని కట్టిపెట్టాలని అల్టిమేటం జారీ చేశారు.

కూలీల ఆటోపైకి దూసుకొచ్చిన ట్రాక్టర్

- వృద్ధురాలు మృతి
- 9 మందికి తీవ్రగాయాలు
- రెండు ముక్కలైన ఓ యువతి కాలు
- ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం
- బాధితులంతా రోజు వారి కూలీలే


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

పెదనందిపాడు(కాకుమాను): వారివి రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు. రోజూ ఏదోక పని చేసుకుంటే కానీ రోజు గడవని స్థితి. అలాంటి పేద కూలీలు ప్రయాణిస్తున్న ఆటోపై ట్రాక్టర్ దూసుకొచ్చి ఆస్పత్రి పాల్జేసింది. ఈ సంఘటన పెదనందిపాడు మండలం పాలపర్తి శివారులోని కోల్డ్ స్టోరేజ్ సమీపంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. పెదనందిపాడు ఎస్ఐ రాజ్ కుమార్ కథనం ప్రకారం.. కాకుమాను మండలం అప్పాపురం గ్రామానికి చెందిన 16 మంది మహిళలు వేకువజామున ఆటోలో పెదనందిపాడు మండలం పాలపర్తి సమీపంలో శనగపంటను కోసేందుకు ఆటోలో వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్లే సమయంలో కోల్డ్ స్టోరేజీలో శనగలు భద్రపరచేందుకు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ కూలీల ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలు ఉన్న 16 మందిలో 9 మందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మూడు 108 వాహనాల్లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారిలో వెంకాయమ్మ (57) అనే వృద్ధురాలు చికిత్సపొందుతూ మృతి చెందింది. మిగిలిన 8 మందిలో ఓ మహిళకు కుడి కాలు రెండు ముక్కలుగా విడిపోయింది. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి ప్రధాన కారణం ట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో, ట్రక్కు సైడు బల్లలు తీయడం వల్లే ప్రమాదానికి కారణమని ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్, ఆటో డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సైన్స్ పోటీల్లో సత్తా చాటిన షేక్ సమీవుస్



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక విజ్ఞానాన్ని వెలికితీసేందుకు జనవిజ్ఞానవేదిక రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీల్లో తాడేపల్లి మండలం నులకపేటలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని షేక్ సమీవుస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈసందర్భంగా విద్యార్థిని సమీవుస్‌తో పాటు పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు షేక్ షాహిద్‌ను డీఈవో పి.శైలజ, ఎంఈవోలు గరిక శాంతకుమారి, డి. నాగేశ్వరరావు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ షేక్ జిలానీ, హెచ్ఎం అబ్దుల్ షజీర్, ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చేసేందుకు పనిచేద్దాం

ఎమ్మెల్సీ సునీత దంపతులను కలిసిన వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం


ఎమ్మెల్సీ సునీత దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్

చీరాల: రాష్ట్ర ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ రాష్ట్రాభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు అందరం కలిసి పనిచేద్దామని వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తపేటలోని నివాసంలో పార్టీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, సురేష్ దంపతులను వెంకటేష్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా సీఎం జగనన్న తనను ప్రకటించడంతో కొద్ది రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో జగనన్న సీఎం చేయడంతో పాటు తనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు సహకరించాలని ఎమ్మెల్సీ దంపతులను వెంకటేష్ కోరారు. గడిచిన ఐదేళ్లుగా ప్రజలకు సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుంటేనే అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు అమలుకాని హామీలను ప్రజలు నమ్మడం లేదని, జనరంజక పాలన అందించే జగనన్న పాలనకు పట్టం కట్టేందు సిద్ధంగా ఉన్నారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు.

పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి..


ఈసందర్భంగా ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ముకానివ్వకుండా పార్టీ అభ్యర్థుల గెలుపునకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. చీరాలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు తమవంతు సహకారం అందించడంతో పాటుగా జగనన్నను మళ్లీ సీఎంగా చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ, పార్టీ నాయకులు సుబ్బారావు, బండికళ్ల నరేష్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

నాయకులను అభినందించిన వెంకటేష్..

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడంతో పాటుగా రానున్న ఎన్నికల్లో చీరాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరువేయాలని.. దీనికి అనుగుణంగా కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో సైనికుల్లా పనిచేయాలని వెంకటేష్ సూచించారు. చీరాల పట్టణం, వేటపాలెం, చీరాల మండలాల్లో వైఎస్సార్ సీపీలో మండల స్థాయిలో పదవులు పొందిన మున్సిపల్ కౌన్సిలర్లు గోలి స్వాతీరవి, గోలి జగదీష్, షేక్ అల్లాభక్షు, గొర్రెముచ్చు సోనీ, మాన్సు బాల ఏసు, తదితర నాయకులను వెంకటేష్ అభినందించి సత్కరించారు. పార్టీ పట్ల నిబద్ధతతో పని చేసి, బలోపేతం చేయాలని సూచించారు.

పెమ్మసాని.. నోరు అదుపులో పెట్టుకో!

ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ ఇలియాస్


మాట్లాడుతున్న షేక్ ఇలియాస్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు షేక్.ఇలియాస్ అన్నారు. స్థానిక లాలాపేటలోని సమితి కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర సమితి అధ్యక్షుడు షేక్.ఖాజావలి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం సమాజానికి పూర్తి వ్యతిరేకంగా ఉన్న భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా ప్రసంగాలు చేయడం సరైంది కాదన్నారు. ఎక్కడో అమెరికాలో ఉన్న పెమ్మసాని ముస్లిం సమాజంపై కొద్దిపాటి గౌరవ మర్యాదలు లేకుండా ఇష్టం వచ్చినట్లు స్వర్గీయ సద్దాం హుస్సేన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. ప్రపంచంలోని ముస్లింలంతా ఒక గొప్ప నాయకుడిగా భావించే సద్దాం హుస్సేన్ వంటి వ్యక్తిని నియంతగా పోల్చడం సరికాదని, అంతే కాకుండా కుక్కలా అతడిని వేటాడి మరీ అమెరికా ఉరి తీసిందని పెమ్మసాని అనటం ముస్లింలను కించపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా పెమ్మసాని స్థానిక ముస్లింలను గౌరవించడం నేర్చుకోవాలని, ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. అధికార పార్టీని విమర్శించాలంటే వారి ఇష్టం వచ్చిన రీతిలో విమర్శించవచ్చని అంతేగాని ముస్లింలు అభిమానించే నాయకుల గురించి కించపరిచేలా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. తక్షణమే పెమ్మసాని ముస్లింలకు బహిరంగ క్షమాపణ చెప్పని పక్షంలో ముస్లింలు తెలుగుదేశం పార్టీకి మరింత దూరమయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఇటువంటివి మరలా పునరావృతం కాకుండా పెమ్మసాని, తెలుగుదేశం పార్టీ నాయకులు సరి చేసుకోవాల్సిందిగా హితవు పలికారు. అదే విధంగా బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ఆయా నియోజకవర్గాల్లో గెలుపునకు ముస్లిం సమాజం ఓట్లు అవసరం లేదని ప్రకటించి చూడమని హెచ్చరించారు.ముస్లిం హక్కుల పోరాట సమితి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు పఠాన్ అమీర్ ఖాన్, పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్.సిరాజ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సమర్థంగా నిర్వర్తించండి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెలా షారోన్



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ అన్నారు. రేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, పట్టణంలోని సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. గ్రామాలలో కోడ్ ఉల్లంఘన జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అభ్యర్థులు ప్రచారాలలో భాగంగా ఏర్పాటు చేసే తాత్కాలిక కార్యాలయాలు, ప్రచార కరపత్రాల పంపిణీలు, ప్రచారాలపై నిఘా ఉంచాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే కార్యక్రమాలను పార్టీల అభ్యర్థులు చేపట్టకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు వ్యక్తుల ఆస్తులపై రాజకీయ పరమైన బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలు లేకుండా చూడాలన్నారు. అధికారుల పనితీరుపై తన పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలి

రేపల్లె రూరల్: రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెలా షారోన్ సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలు, ఫిర్యాదుల స్వీకరణపై రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ 24 గంటలూ పని చేస్తుందని చెప్పారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేసే వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామన్నారు. కంట్రోల్ రూమ్‌లో 08648 293795 నంబరుకు తెలియ జేయాలన్నారు. సీవిజిల్ యాప్‌ను వినియోగించి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ యాప్‌లోకి వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాల లోపు పరిష్కరించబడునని వివరించారు. రాజకీయ పార్టీ అభ్యర్థులు ప్రచారాలలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, రోడ్‌షోలకు తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. బహిరంగ సభల్లో ప్రచారంలో వినియోగించే లౌడ్ స్పీకర్‌లకు అనుమతులు ఉండాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత, ఉదయం 6 గంటల లోపు లౌడ్ స్పీకర్‌లను వినియోగించరాదన్నారు. ద్విచక్ర వాహనాలను ర్యాలీలలో 10 కంటే ఎక్కువ వినియోగించరాదన్నారు. ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలను ఏర్పాటు చేసినా, పెద్ద పెద్ద జెండాలను వినియోగించినా కోడ్ ఉల్లంఘన కింద కేసులు నమోదు చేస్తామన్నారు. దీంతో పాటు ప్రచారానికి అయ్యే ఖర్చును ఎన్నికల అభ్యర్థి ఖాతాలో లెక్కరాయటం జరుగుతుందన్నారు. ఆయా పార్టీల అధినేత పర్యటనలో భాగంగా నిర్వహించే రోడ్‌షోలకు అనుమతితో పాటు ఆ షోలలో ఎంత ఎంది కార్యకర్తలు పాల్గొనేది ముందుగానే తమకు తెలియజేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రచారాలలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదన్నారు. ఆయా పార్టీల కదలికలపై తమ కమిటీల నిఘా ఉంటుందని చెప్పారు. పార్టీల అభ్యర్థులు నిబంధనలు పాటించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

ఎమ్మెల్యే కోన రఘుపతి



పూండ్ల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: సంక్షేమం, అభివృద్ధి చూసి ఆశీర్వదించాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని పూండ్ల గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం చేపట్టారు. ఎమ్మెల్యే కోన రఘుపతికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటా ఆప్యాయంగా పలకరింపులు దక్కాయి. ఒకరు తనకు నెలవారీ పింఛన్ సక్రమంగా వస్తోందని, మరొకరు తనకు చేయూత వచ్చిందంటూ ఆనందంగా చెప్పుకుంటూ కోన రఘుపతితో కలిసి నడిచారు. మేమంతా జగనన్న వెనుకే ఉంటామని నినదిస్తూ పార్టీ జెండాను భుజాన వేసుకొని కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, నాయకులు గంగిశెట్టి రతయ్య, గవిని కృష్ణమూర్తి, సుమన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు వరం

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి



చంపాడు గ్రామ ఆత్మీయ సమ్మేళన సభలో వరికూటి

చంపాడు(వేమూరు): పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వరం లాంటివని నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు మండలంలోని చంపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమేళనం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా పార్టీలకు సంబంధం లేకుండా పథకాలు అందించడం జరిగిందని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వేమూరు నియోజక వర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని గ్రామస్తులంతా తనను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం బుధ వారం నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. త్వరలో నియోజక వర్గంలో సైతం ప్రచారం ప్రారంభించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు గెలుపునకు నాంది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు ఈపూరు కుసుమ, మేరుగ రాధాకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు, జే ఏసీ కన్వీనరు దాది సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు గాజుల భాను ప్రకాశ్, పీకా సన్నీ డేలు, పీకా రామకృష్ణ, పీకా చంటి, వీ శ్యామ్ బాబు, పమిడి పాముల రాజశేఖర్, దోనేపూడి నిరీక్షణరావు, తలతోటి సువర్ణరావు, కోగంటి లవకుమార్, దన్నా మేరీసు బాబు, గుమ్మడి దానియేలు, గాజుల చిన్న భాను, మోదుకూరి హరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెదపులివర్రు, భట్టిప్రోలులో ముగిసిన బ్రహ్మోత్సవాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన శ్రీ భూ నీళా సమేత శ్రీ వరదరాజ స్వామి దేవాలయంలో పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి రాత్రి ద్వాదశ ప్రదక్షిణాలు, శ్రీ పుష్ప యాగోత్సవం, శ్రీ వారి ఏకాంత సేవ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను దేవాలయ కార్య నిర్వహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షించారు. భట్టిప్రోలు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారి పవళింపు సేవతో కార్యక్రమాలు ముగిశాయి. ఫౌండర్ ట్రస్టీలు, అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘం, వంశ పారంపర్య ధర్మకర్తలు, కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ పాలసీ డేటా క్రమబద్ధీకరణ

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా శాఖ (ఏపీజీఎల్ఐ) ఉద్యోగ, ఉపాధ్యాయ పాలసీదారుల ప్రయోజనాలకై సేవలను క్రమబద్ధీకరించినట్లు ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ మంగళవారం తెలిపారు. పాలసీ వివరాలు, స్వీకరించిన చందాలు, తీసుకున్న రుణాలు వంటివి అప్‌డేట్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగుల పాలసీ డేటా అంతా సక్రమంగా ఉందో లేదో ధృవీకరించు కోవాలని తెలిపారు. ఏవైనా మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే ఏప్రిల్ నెలాఖరు లోగా అవకాశం ఉందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎన్నికల నియమావళి అమలుకు సహకరించండి

వేమూరు: సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తహసీల్దారు కిరణ్ తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ కోడ్ ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలను సక్రమంగా అమలు చేసేందుకు రాజకీయ నాయకుల పూర్తి సహకారం అవసరమన్నారు. నియోజకవర్గంలోని సరిహద్దుల వద్ద పోలీసు పికెట్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. మే నెల 13న ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లిముంత ఏడుకొండలు, దొప్పలపూడి జ్యోతి బాబు, మైనేని మురళీ, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పవిత్ర వారం.. శిలువతో పాదయాత్ర



ప్రత్తిపాడు: పవిత్ర వారంలో శిలువతో విశ్వాసులు పాదయాత్ర చేపట్టారు. ప్రత్తిపాడు మండలం రావిపాటివారిపాలెం (చినకోండ్రుపాడు) అమలోద్భవిమాత దేవాలయం నుంచి వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలోని ఆరోగ్యమాత దేవాలయం వరకు విశ్వాసులు అధిక సంఖ్యలో పాదయాత్ర చేశారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వాసులు 40 రోజుల పాటు ఉపవాస దినాలు చేస్తారు. పవిత్రవారం కావడంతో విచారణ గురువులు బాసాని దినేష్, తమనంపల్లి సంతోష్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్ర పొడవునా విశ్వాసులు, క్రైస్తవులు క్రీస్తు శిలువను మోస్తూ, ఏసు గీయాలను ఆలపిస్తూ పాదయాత్ర చేశారు. ఆరోగ్యమాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకుని, కానుకలు సమర్పించుకున్నారు.

ముగిసిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు



తెనాలిటౌన్: పట్టణ చెంచుపేట అమరావతి కాలనీలోని గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 13 నుంచి జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయంలో ఉదయం నిత్య హోమం, మహాపూర్ణాహుతి, వసంతోత్సవం జరిపారు. స్వామి వారికి చక్రస్నానం చేయించారు. విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయంలో సాయంత్రం పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, ఆశీర్వచనం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

సంక్షేమ సారథి జగనన్నకు మద్దతుగా నిలుద్దాం

సినీ రచయిత కోన వెంకట్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కోన వెంకట్, నాయకులు

కర్లపాలెం: ఎన్నికల హామీలను అమలు చేసిన సంక్షేమ సారథి జగనన్నను, బాపట్ల జిల్లా సాధకుడు కోన రఘుపతిని రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని ప్రముఖ సినీ రచయిత, నిర్మాత, వైఎస్సార్ సీపీ నాయకులు కోన వెంకట్ కోరారు. వైఎస్సార్ సీపీ బాపట్ల అసెంబ్లీ అభ్యర్థి కోన రఘుపతి, పార్లమెంటు అభ్యర్థి నందిగం సురేష్‌లకు మద్దతుగా కోన వెంకట్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి అనుమతులు తీసుకుని ఇంటంటి ప్రచారం చేపట్టారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల కరపత్రాలను అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, కో ఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, పెదపులుగువారి పాలెం సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ మరకా పెద వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు గొర్ల కమల, సుబ్బారావు, ఆసిఫ్ అలీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, చీరాల సత్యనారాయణరెడ్డి, కేసాని వరప్రసాద్, ఆట్ల పెద శ్రీనివాసరెడ్డి, గొర్రుముచ్చు మీరయ్య, భావన్నారాయణ, శివారెడ్డి, సాగర్, ఇసాక్, శివరావు, రామిరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, షంషీర్, మార్రు బెనర్జి, చెన్నారెడ్డి, వీరారెడ్డి, ఎం.పాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో పేదలకు న్యాయం

పిట్టలవానిపాలెం: రాష్ట్రంలో కుల మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే నని వైఎస్సార్ సీపీ నాయకుడు, బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ అన్నారు. మండలంలోని సంగుపాలెం గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. నవరత్నాల పేరుతో రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి పరుగులు తీసిందని గుర్తు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వెస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, స్థానిక సర్పంచ్ ఎనికేపల్లి శివకుమారి, ఎంపీటీసీ సభ్యులు గంగయ్య, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కుంభం ప్రసన్నరాజు, చేబ్రోలు వీరయ్య, మండే విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల మస్టర్లు పరిశీలన

వేమూరు: ఉపాధి పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీల మస్టర్లు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పని అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పిస్తోందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోకూరి ఏసోబు, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపట్నం: మండల కేంద్రమైన నిజాంపట్నంలోని మహాత్మ జ్యోతిబా పూలే ఏపీ బీసీ గురుకుల బాలుర కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్‌లో చేరగోరు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు గానూ దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తు ఫీజు రూ.250లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 31 లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9866559636, 08648 257972 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆటో అదుపు తప్పి వ్యక్తి మృతి

బాపట్ల టౌన్: ఆటో అదుపు తప్పిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన తాడిశెట్టి హరిబాబు(60)కు చెందిన బంధువులు బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వారిని పరామర్శించేందుకు మాచవరం గ్రామం నుంచి ఆటోలో బయలుదేరాడు. ఆటో బాపట్ల నుంచి పొన్నూరు వైపు వెళ్తున్న సమయంలో బాపట్ల- అప్పికట్ల ప్రధాన రహదారిలో పట్టణ శివారులోని కేబీ పాలెం సమీపంలో ఆటో బోల్తా పడి హరిబాబుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హరిబాబు మృతి చెందాడు. ఈ మేరకు రూరల్ సీఐ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు సదరం క్యాంపు నిర్వహణ

వేమూరు: దివ్యాంగులకు సదరం క్యాంపు నిర్వహించడం జరిగిందని వైద్యులు స్కైలాబ్ నాయక్ చెప్పారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సదరం క్యాంపులో 10 మంది రోగులకు పరీక్ష చేశారు. దివ్యాంగులు సదరం సర్టిఫికేట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వారికి పరీక్ష చేసిన అనంతరం సర్టిఫికేట్లు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు



ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులు



పిన్నిబోయినవారిపాలెంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

- వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే
- ఒకే రోజు 60 కేసుల నమోదుతో అప్రమత్తం

బాపట్ల: బాపట్ల పట్టణంతో పాటు రూరల్ గ్రామం పిన్నిబోయినవారిపాలెంలో డయేరియా కేసులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒక్క రోజులోనే 60 కేసులు నమోదు కావటంతో వైద్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కలుషితమైన నీటి వలనే వాంతులు, విరోచనలకు ప్రజలు గురౌతున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు. పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో అప్పికట్ల వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డాక్టరు ఉస్మాన్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈటీపీఆర్డీ పులి శరత్ బాబు, జిల్లా మలేరియా అధికారి వై.రాజ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సువర్ణ కుమారి, పంచాయతీ కార్యదర్శులు పల్నాటి శ్రీరాములు, స్టాలిన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వాణి సుమన్విత, వైద్య సిబ్బంది దుర్గమ్మ, రత్న శేఖర్, షకీల్, శ్రీనివాసరావు, శ్రావణి, తిరుపతమ్మ, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడులు అరికట్టండి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణులు

రేపల్లె రూరల్: అర్చకులపై దాడులకు పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ బ్రాహ్మణులు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఫాల్గుణ పౌర్ణమి రోజున తానిచ్చిన పాలు శివ లింగంపై సరిగా పోయలేదని కాకినాడలోని దేవాలయం వీధి పురాతన శివాలయంలో భక్తుల సమక్షంలో అర్చకుడు పి.వెంకట సత్యసాయిని అసభ్య పదజాలంతో దూషిస్తూ కాలితో తన్నిన మాజీ కార్పొరేటర్ చంద్రరావుపై చర్యలు తీసుకోవాలన్నారు. సత్యసాయిని కొడుతున్న సమయంలో అడ్డువచ్చిన మరో అర్చకుడు మద్దిరాల విజయ్‌కుమార్‌ను సైతం అసభ్య పదజాలంతో దూషించి చెంపపై కొట్టడం సిగ్గుచేటన్నారు. అధికారులు స్పందించి దాడికి పాల్పడిన చంద్రరావుపై చర్యలు తీసుకోవటంతో పాటు భవిష్యత్‌లో ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు సీవీ మోహనరావు, వి.గోపీనాథ్, సురేష్‌శర్మ, మహేష్, నాగసాయి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

బండ్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మహాగౌరీదేవి అలంకారంలో బండ్లమ్మ

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి జి.నరసింహామూర్తి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుట కొరకు ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పసుపు కొమ్ములతో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా బండ్లమ్మ వారిని మహాగౌరీ దేవిగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలులో అలసత్వం

దమ్మనవారిపాలెంలో అమలుకాని ఎన్నికల కోడ్



దమ్మనవారిపాలెంలో ఓ ఇంటి గోడకు అంతికించి ఉన్న టీడీపీ ఎన్నికల ప్రచార పోస్టర్

కర్లపాలెం: ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు చేయాల్సిన గ్రామ స్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత కర్లపాలెం సెంటర్‌తో పాటు మండల పరిధిలోని వైఎస్సార్ విగ్రహాలకు ముసుగులు వేశారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించి హడావిడి చేసిన అధికారులు గ్రామ స్థాయిలో మాత్రం ఎన్నికల కోడ్ అమలు పట్ల సరైన శ్రద్ధ చూపటం లేదని పలువురు నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. దమ్మనవారిపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ నివాసానికి సమీపంలో, గ్రామంలోని పలు కూడళ్లలో టీడీపీ నాయకుల ఎన్నికల ప్రచార పోస్టర్లు తొలగించాల్సిన గ్రామస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయటంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల కోడ్ సరిగా అమలు చేయాలని కోడ్ అమలు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో టీడీపీ ఎన్నికల ప్రచార పోస్టర్‌లను ఇప్పటికీ తొలగించలేదని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. మండల స్థాయి అధికారులు ఎన్నికల కోడ్ అమలుపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థులకు జాతీయస్థాయి బహుమతులు



అవార్డు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

గుంటూరు రూరల్: ఏఐ టెక్నాలజీ సాయంతో సరికొత్త మార్గం చూపడంలో తమ కళాశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయస్థాయిలో అవార్డు రావడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల చిత్తూరులోని శ్రీ సిటీలో నిర్వహించిన నేషనల్ లెవెల్ హ్యాకథాన్ ప్రొటో టైప్ కంపిటేషన్‌లో ఎన్వీ నీహార్ చౌదరి, జోసెఫ్ ప్రేమ్ నేత్ర దర్శన్ అనే ప్రదర్శనకు ప్రథమ స్థానం లభించటంతోపాటు రూ.25 వేలు నగదు పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యా బోధనకు, పరిశోధనల ప్రోత్సాహకానికి నిదర్శనమని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంధత్వ సమస్యను పరిష్కరించటానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ జి.రామమోహన్‌బాబు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ అభినందించారు.

ముస్లింల సమాధుల తోటలను శుభ్రం చేయించండి

తెనాలిఅర్బన్: రంజాన్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని ఈద్గాలలో ఉన్న ముస్లింల సమాధుల తోటలను శుభ్రం చేయించాలని తెనాలి పట్టణ ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, ఉపాధ్యక్షుడు షేక్ జానీలు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్న మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ సమాధుల తోటలను శుభ్రం చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈద్గా కమిటీ కార్యదర్శి షేక్ సలీమ్, నాయకులు షేక్ అన్సారీ, షేక్ బాబు, షేక్ నబీ, షేక్ సైదా పాల్గొన్నారు.

ముగిసిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల బ్రహ్మోత్సవాలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు

తెనాలిఅర్బన్: రామలింగేశ్వరపేటలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. వారం రోజుల నుంచి దేవస్థానంలో విశేషమైన పూజలు, యాగాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేష అర్చనలు నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం దాతల సహకారంతో సుమారు రెండు వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, న్యాయవాది హరిదాసు గౌరిశంకర్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, కొండూరు శివయ్య, కాళిదాసు ప్రభుదాసు, మట్టుపల్లి గోపాల్, భక్తులు పాల్గొన్నారు.